క్లుప్తంగా

కషాయాలతో చీడపీడల నివారణ



కషాయాల తయారీపై మహిళలకు శిక్షణ అందిస్తున్న అధికారులు

ఆనందపురం : సహజ సిద్ధమైన ఆకులతో తయారు చేసిన కషాయాలను పంటలపై పిచికారీ చేస్తే చీడపీడలను నివారించవచ్చని ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా అధికారి మోహన్‌రావు సూచించారు. కషాయం (బ్రహ్మాస్త్రం) తయారీపై రైతులకు తర్లువాడలో బుధవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు కిలోల వేప ఆకు, రెండేసి కిలోలు చొప్పున జామ, బొప్పాయి, జిల్లేడు, సీతాఫలం ఆకులు, 10 లీటర్ల ఆవు మూత్రం కలిపి ఉడక బెట్టాలని సూచించారు. 48 గంటల తర్వాత పల్చని గుడ్డతో వడగట్టి వంద లీటర్ల నీటిలో రెండున్నర లీటర్ల కషాయం కలిపి ఎకరానికి పిచికారీ చేయాలని వివరించారు. దీనివల్ల పంటల్లో చీడపీడలను నివారించవచ్చని సూచించారు. రామారావు, తదితరులు పాల్గొన్నారు.

భూముల రీ సర్వే వేగవంతం చేయాలి



రీ సర్వే వివరాలు పరిశీలిస్తున్న జేసీ విశ్వనాథన్

పద్మనాభం: బాందేవపురంలో భూముల రీ సర్వేను ఈ నెల 15వ తేదీలోగా పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్ సూచించారు. మండలంలోని బాందేవపురంలో జరుగుతున్న భూముల రీ సర్వేను బుధవారం ఆయన క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్వే పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. సంబంధిత వివరాలను పరిశీలించారు. అనంతరం మండల సివిల్ సప్లై గొడౌన్‌లో సీజ్ చేసి ఉంచిన బియ్యాన్ని పరిశీలించారు. ఆయన వెంట ఆర్డీవో భాస్కరరెడ్డి, తహసీల్దార్ శ్రీవల్లి, డీటీ కిశోర్ కుమార్ ఉన్నారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

తగరపువలస: చిట్టివలస విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు ఫీడర్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని టౌన్ ఏఈఈ బొట్టా రవి తెలిపారు. ఈ అంతరాయం కారణంగా తగరపువలస, చిట్టివలస, ఆదర్శనగర్, సంగివలస, చిల్లపేట, సామియ్యవలస, తాటితూరు, టి.నగరపాలెం, బాలాజీనగర్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు.

ఘనంగా మానవ హక్కుల కౌన్సిల్ వార్షికోత్సవం

దాబాగార్డెన్స్ : మానవ హక్కులను పరిరక్షించడమే ప్రథమ కర్తవ్యమని హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ రాష్ట్ర కార్యదర్శి మంత్రి శ్యాంప్రసాద్ పేర్కొన్నారు. అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ 24వ వార్షికోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో దామోదర సంజీవయ్య లా కాలేజీ మాజీ ఉప కులపతి ఆచార్య వై. సత్యనారాయణ పాల్గొని జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్యాంప్రసాద్ మాట్లాడుతూ ఇప్పటికీ ప్రజల్లో తమకు గల హక్కులపై సరైన అవగాహన లేకపోవడంతోనే అన్యాయానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆచార్య వై.సత్యనారాయణ మాట్లాడుతూ ఇప్పటికీ మహిళలు, చిన్నారులపై లైంగిక వేధింపులు, దాడులు జరగడం పట్ల విచారం వ్యక్తం చేశారు. ఏయూ డాక్టర్ అంబేడ్కర్ లా కాలేజీ ఆచార్య విజయలక్ష్మి మాట్లాడుతూ మానవ హక్కుల పరిరక్షణకు ప్రతి పౌరుడు చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు పి.జగన్మోహనరావు, రిటైర్డ్ పోలీస్ అధికారి ఎస్వీ రమణ పాల్గొన్నారు.

సీఎం జగనే రియల్ హీరో

- సామాన్యులను లక్షాధికారులను చేస్తున్న ముఖ్యమంత్రి
- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



గిడిజాలలో అంగన్‌వాడీ భవనం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



మూలకుద్దులో సర్టిఫికెట్లు అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

తగరపువలస: నాలుగున్నరేళ్లలో రాష్ట్రంలో అర్హులందరినీ లక్షాధికారులుగా చేస్తున్న సీఎం జగనే రియల్ హీరో అని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు కొనియాడారు. భీమిలి మండలం మూలకుద్దు, మజ్జిపేట పంచాయతీల్లో బుధవారం సాయంత్రం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూలకుద్దులో 500 కుటుంబాలు ఉండగా సంక్షేమ పథకాల కింద రూ.11.44 కోట్లు, అభివృద్ధి పనుల కోసం రూ.4.18 కోట్లు ఖర్చు చేశామన్నారు. సగటున ఒక్కో కుటుంబానికి రూ.3 లక్షల లబ్ధి చేకూరిందన్నారు. పుట్టిన బిడ్డ దగ్గర నుంచి చనిపోయిన వారి వరకు ప్రతీ ఒక్కరికీ ఏదో విధంగా లబ్ధి చేకూర్చాలన్నదే సీఎం జగన్ లక్ష్యమన్నారు. నిరంతరం సాగుతున్న ఈ ప్రక్రియతోపాటు వలంటీర్, సచివాలయ వ్యవస్థల కొనసాగింపు కోసం ఎన్నికలు ఎప్పుడు వచ్చినా వైఎస్సార్‌సీపీని గెలిపించుకోవాలని కోరారు.

కళ్లుండీ చూడలేని కబోది పవన్..

రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని కళ్లుండీ చూడలేని కబోది పవన్ అని ముత్తంశెట్టి శ్రీనివాసరావు విమర్శించారు. చంద్రబాబు రాసిచ్చిన స్క్రిప్ట్ చదువుతూ మహిళల ఇంట్లో వలంటీర్లు దూరుతున్నారని కూసిన తప్పుడు కూతలు వెనక్కు తీసుకుని బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నాయకులు పొరపాటుగా మాట్లాడితే తప్పులేదని, స్పృహలో లేకుండా మాట్లాడితే ప్రజలతో చెప్పుదెబ్బలు తినాల్సి వస్తుందన్నారు. సచివాలయ వ్యవస్థపై నాలుగేళ్లలో నాలుగు విధాలుగా మాట్లాడిన చంద్రబాబు తన పాలనలో మహిళలను సున్నా వడ్డీ, రుణమాఫీ పేరుతో వంచనకు గురి చేశారన్నారు. కార్యక్రమంలో భీమిలి తహసీల్దార్ కోరాడ వేణుగోపాల్, ఎంపీడీవో పి.వెంకటరమణ, భీమిలి ఏఎంసీ చైర్మన్ ఎలమంచిలి సూర్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, మండల సచివాలయాల కన్వీనర్ సరగడ రఘునాథరెడ్డి, సర్పంచ్‌లు కొల్లి పార్వతి, కొల్లి కోటిరెడ్డి, సమ్మిడి శ్రీనివాసరావు, మజ్జి సూరినాయుడు, గాడు వెంకటనారాయణ ఎంపీటీసీ మజ్జి శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు దుంపల ప్రభాకర్, మల్లేటి హరి, శిరిగుడి ఈశ్వరరావు, కేజీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లు ప్రజా సేవకులు

ఆనందపురం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆలోచనా విధానంతో రూపుదిద్దుకున్న వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజలకు ఉత్తమమైన సేవలు అందుతున్నాయని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు చెప్పారు. మండలంలోని గిడిజాల, కణమాం గ్రామాల్లో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఇంటి ముంగిటకే సేవలు అందించాలనే తలంపుతోనే వలంటీర్ల వ్యవస్థను ప్రవేశపెట్టారని వివరించారు. అతి తక్కువ వేతనంతో పని చేస్తున్న వలంటీర్లు ప్రజా సేవకులని కొనియాడారు. కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి వలంటీర్లు రోగులకు సేవలందించిన వైనం పవన్ కల్యాణ్‌కు గుర్తు లేకపోవడం శోచనీయమన్నారు. వలంటీర్ వ్యవస్థే లేకపోతే నాలుగేళ్లలో రాష్ట్రంలో ఇన్ని సంక్షేమ కార్యక్రమాలు అమలు సాధ్యమయ్యేదా అని ప్రశ్నించారు. రాజకీయ లబ్ధి కోసం పవన్ కల్యాణ్, చంద్రబాబు దిగజారి మాట్లాడుతున్నారని ప్రజలు గుర్తుపెట్టుకోవాలన్నారు. చంద్రబాబు గతంలో సున్నా వడ్డీ అన్నాడు, డ్వాక్రా రుణమాఫీ అన్నాడు... అమలు చేశాడా అని ప్రశ్నించారు. గ్రామాల్లో నిర్వహించే సమావేశాల్లో వ్యక్తిగత సమస్యలు కాకుండా గ్రామ అవసరాలను తన దృష్టికి తీసుకురావాలని కోరారు. గిడిజాలలో సంక్షేమ పథకాలకు రూ.23 కోట్లు, అభివృద్ధి పనులకు రూ.5.40 కోట్లు వ్యయం చేశామని చెప్పారు. అనంతరం గిడిజాలలో అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభించారు. పలువురికి ధ్రువీకరణ పత్రాలు అందించారు. కార్యక్రమంలో జగనన్న సురక్ష ప్రత్యేకాధికారి సత్యపద్మ, జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, పార్టీ మండల అధ్యక్షుడు బంక సత్యం, మజ్జి వెంకటరావు, వైస్ ఎంపీపీ పాండ్రంకి శ్రీను, ఎంపీడీవో అడపా లవరాజు, తహసీల్దార్ లోకవరపు రామారావు, సర్పంచ్‌లు షిణగం అప్పలరాజు, ఆబోతు అప్పలరాము, ఎంపీటీసీ సభ్యుడు గొలగాని కృష్ణ, నాయకులు కోరాడ ముసలినాయుడు, బంటుబిల్లి మణిశంకర నాయుడు, లెంక రాంబాబు, బొట్టా రామకృష్ణ, షిణగం రాంబాబు, కోండ్రోతు అప్పలనారాయణ, కోరాడ వెంకట రమణారావు, పిన్నింటి రమణ, బలిరెడ్డి మహేష్ పాల్గొన్నారు.

గాయత్రిలో 80 శాతం మందికి ఉద్యోగాలు



ఉద్యోగాలు పొందిన విద్యార్థులతో యాజమాన్యం

కొమ్మాది: 2021 – 23 విద్యా సంవత్సరానికి సంబంధించిన మేనేజ్‌మెంట్ కోర్సుల విద్యార్థుల ప్లేస్‌మెంట్ సక్సెస్ మీట్‌ను బుధవారం రుషికొండ గాయత్రి కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఉపాధ్యక్షులు డి.దక్షిణామూర్తి మాట్లాడుతూ తమ కళాశాలలో 80 శాతం మంది విద్యార్థులకు ఉద్యోగావకాశాలు రావడం ఆనందించదగిన విషయమన్నారు. అనంతరం ఉద్యోగాలు పొందిన విద్యార్థులను అభినందించారు. కళాశాల సంయుక్త కార్యదర్శులు ప్రగడ రాజగణపతి, డీవీఎస్ కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చెరువును తలపిస్తున్న హైస్కూల్ మైదానం



చంద్రంపాలెం హైస్కూల్ మైదానంలో నిలిచిన వర్షం నీరు

మధురవాడ: చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానం మంగళవారం మధ్యాహ్నం కురిసిన వర్షం నీరు బయటకు వెళ్లకపోవడంతో చిన్నపాటి చెరువును తలపిస్తోంది. దీంతో పాఠశాలలో ఉన్న 3,800 మంది విద్యార్థులు బుధవారం ఉదయం ప్రార్థన చేసుకోవడంతోపాటు మధ్యాహ్నం భోజనం చేయడానికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి వర్షం నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

మైదానం అభివృద్ధికి రూ.5 లక్షలు

ఈ పాఠశాల మైదానంలో నీరు తరలించడానికి, నీరు నిలవకుండా ఉండడానికి, ఇతర అభివృద్ధి పనుల నిమిత్తం 'నాడు – నేడు' కింద రూ.5 లక్షలు మంజూరైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.రాజబాబు తెలిపారు. ఈ మేరకు బుధవారం మైదానాన్ని పాఠశాల కమిటీ సభ్యులు, అధికారులు పరిశీలించారు.

దేశానికి ఆదర్శప్రాయుడు అంబేడ్కర్



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

కొమ్మాది: రాజ్యాంగం రచించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ దేశానికి ఆదర్శప్రాయుడని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. ఇటీవల జీవీఎంసీ 5వ వార్డు సాయిరాం కాలనీలో మద్యం మత్తులో ఇద్దరు యువకులు అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన సంగతి తెలిసిందే. అక్కడ ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు సమకూర్చిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. బుధవారం ఆ విగ్రహాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో వివక్షను ఎదుర్కొనే రోజుల్లో బడుగు, బలహీన వర్గాల కోసం పోరాటాలు చేసి సమాజంలో వారి కుటుంబాలకు ఉన్నత స్థానం అందించిన ఆశాజ్యోతి అంబేడ్కర్ అని కొనియాడారు. విగ్రహాలను ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఇప్పటికే ఆదేశించామని, అదేవిధంగా మహనీయుల విగ్రహాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని పోలీసులను ఆదేశించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నియోజకవర్గ ఇన్‌చార్జి సియాద్రి కనకరాజు, వైఎస్సార్ సీపీ 6వ, 7వ వార్డుల అధ్యక్షులు బొట్టా అప్పలరాజు, పోతిన శ్రీను, స్థానిక నాయకులు పోతిన సురేష్, కుడుత రామారావు, పోతిన ఎల్లాజీ, అల్లాడ లింగేశ్వరరావు, బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

పాడిరైతుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం



కోరాడలో మాట్లాడుతున్న పశు సంవర్థక శాఖ డిప్యూటీ డైరెక్టర్ కరుణాకర్



అమనాంలో పాడిరైతుకు గడ్డి విత్తనాలు అందిస్తున్న సర్పంచ్ ఉమాదేవి, అధికారులు

తగరపువలస: రాష్ట్రంలో పాడిరైతుల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత కల్పిస్తోందని పశు సంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎస్.కరుణాకరరావు అన్నారు. పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా బుధవారం భీమిలి మండలం అమనాం పంచాయతీలో రైతులకు అవగాహన కల్పించారు. పశుగ్రాసం పెంపకం, వాటి పోష్టిక విలువలు, రాయితీపై లభించే విత్తనాల గురించి వివరించారు. వివిధ రకాల పప్పు జాతి గ్రాసాలు, ధాన్యపు జాతి గ్రాసాల సాగుపై వివరించారు. దశరథ గడ్డి (హెచ్ లోసర్న్) పెంచడం వల్ల ఆవులు, గేదెల మేపుకే కాకుండా గొర్రెలు, మేకలకు కూడా ఉపయోగపడుతుందన్నారు. పశుబీమా పథకాన్ని అందరూ వినియోగించుకోవాలని సూచించారు. రాయితీలో రూ.12వేలకు గడ్డికోత యంత్రం లభిస్తుందన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ దంతులూరి ఉమాదేవి చేతుల మీదుగా రైతులకు రాయితీపై గడ్డి విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో భీమిలి సహాయ సంచాలకుడు వెంకటరమణ, జిల్లా స్పెషల్ ఫ్యాకల్టీ వైద్యుడు మదీనా ప్రసాద్, దాకమర్రి పశువైద్యశాల వైద్యుడు జి.కాంతి కిరణ్, ఉప సర్పంచ్ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

పచ్చగడ్డితో అధిక పాల దిగుబడి

పద్మనాభం: పాడి పశువులకు పచ్చ గడ్డి పెట్టడం వల్ల పోషకాలు పెరిగి అధిక పాల దిగుబడి వస్తుందని పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎస్.కరుణాకర్ అన్నారు. మండలంలోని కోరాడలో పశుగ్రాసాల పెంపకం, పచ్చగడ్డి మేపడం వల్ల కలిగే ప్రయోజనాలపై బుధవారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చగడ్డి పశువులకు వేయడం వల్ల దాణా ఖర్చు తగ్గుతుందన్నారు. కాకిజొన్న, బొబ్బర్లు వంటి గడ్డి విత్తనాలను 75 శాతం సబ్సిడీపై రైతులకు సరఫరా చేస్తామన్నారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, సర్పంచ్ కోరాడ లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ ఏడీ బి.వి.రమణ, రెడ్డిపల్లి పశువైద్యాధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతుల హక్కుల పరిరక్షణలో నిర్లక్ష్యం వద్దు

- రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు సీతారాం



అధికారులతో మాట్లాడుతున్న గొండు సీతారాం

మధురవాడ: విభిన్న ప్రతిభావంతులైన పిల్లల హక్కుల పరిరక్షణలో ఎవరూ నిర్లక్ష్యం ప్రదర్శించవద్దని, వారిని అన్ని రకాలుగా ఉన్నత స్థితిలోకి తీసుకురావాల్సిన బాధ్యత అందరిపై ఉందని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం అన్నారు. నగరంలోని బక్కన్నపాలెం టీసీపీసీ సెంటర్‌లో విభిన్న ప్రతిభావంతుల హక్కులు, వారికి కల్పిస్తున్న సౌకర్యాలపై బుధవారం సమీక్ష నిర్వహించారు. ఇందుకు సంబంధించిన సమాచారం అధికారుల నుంచి తీసుకున్నారు. జిల్లాలో 18 ఏళ్లలోపు ఉన్న పిల్లలు ఎంత మంది ఉన్నారు.. వారిలో ఎంతమందిని ప్రభుత్వ పథకాలకు అర్హులుగా గుర్తించారు.. ఎందరికి పింఛన్లు ఇస్తున్నారు.. జిల్లా స్థాయిలో ఎటువంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. నిర్బంధ విద్యా హక్కు చట్టం ప్రకారం ఎంత మంది విద్యార్థులను ఏయే పాఠశాలల్లో చేర్పించారో తెలుసుకున్నారు. వీరికి కేంద్ర ప్రభుత్వమే పూర్తి ఫీజులు చెల్లిస్తున్నందున ఆయా స్కూళ్ల వివరాలు, ఫీజుల రసీదులపై ఆరా తీశారు.

కేంద్ర ప్రభుత్వం జిల్లాలో నియమించిన స్పెషల్ ఎడ్యుకేటర్స్ పనితీరు, ఎన్జీవోలకు ప్రభుత్వం నుంచి అందుతున్న సహాయంపై ఆరా తీశారు. పిల్లల సంక్షేమం, హక్కులతో ముడిపడి ఉన్న అనేక సమస్యలు, ప్రాధాన్యతలు గుర్తించినట్టు సీతారాం చెప్పారు. వాటి పరిష్కారానికి కమిషన్ చైర్మన్ ద్వారా జిల్లా అధికారులకు సిఫార్సు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ జె.మాధవి, జిల్లా బాలల సంక్షేమ సమితి చైర్‌పర్సన్ ఎంఆర్ఎల్.రాధ, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి సత్యనారాయణ, సీడీపీవో శ్రీదేవి, జిల్లా బాలల సంరక్షణ అధికారి ఎం.రమేష్, బక్కన్నపాలెం టీసీపీసీ ప్రిన్సిపాల్ భాస్కర్, పలువురు ఎన్జీవోలు, విద్యార్థులు పాల్గొన్నారు.

మరమ్మతులకు గొయ్యి తవ్వి.. వదిలేశారు



పైప్‌లైన్ మరమ్మతుల కోసం రోడ్డు మధ్యలో తవ్వి వదిలేసిన గొయ్యి

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు గణేష్ థియేటర్ నుంచి చావుల మదుము రహదారి పైపులైన్ల మరమ్మతుల కోసం తీసిన గోతులు నెలల తరబడి అలాగే ఉండిపోయాయి. దీంతో ప్రస్తుతం ఈ రహదారిలో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ద్విచక్ర వాహనదారులు అతి కష్టం మీద రాకపోకలు సాగిస్తున్నారు. ఇప్పటికీ ఈ మార్గంలో రెండుచోట్ల నిరంతరం నీరు లీకవుతూ ప్రవహిస్తుండడంతో చెరువులా కనిపిస్తోంది. ఈ క్రమంలో వచ్చే ద్విచక్ర వాహనాలు జారిపడుతున్నాయి. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారి మధ్యలో పైపులైన్ వేయడంతో తరచూ ఈ మార్గాన్ని మూసివేయాల్సి వస్తోంది. వివిధ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు, థియేటర్లకు వచ్చే ప్రేక్షకులు, కార్మికవాడ, శ్మశానవాటికలకు వచ్చేవారికి ఇదే ప్రధాన రహదారి. గతంలో పక్కాగా సీసీరోడ్డు ఉండేదని, నేరుగా రాకపోకలు సాగించేవారిమని... ఇప్పుడు పైప్‌లైన్ల మరమ్మతుల కోసం తీసిన గోతులు పూడ్చకపోవడంతో చుట్టూ తిరిగి జ్యూట్‌మిల్లు రోడ్డులో నుంచి రాకపోకలు సాగిస్తున్నట్టు పలువురు వాపోతున్నారు. వేలాది మందికి రాజమార్గంగా ఉన్న చావుల మదుము రోడ్డును పూర్తి స్థాయిలో రాకపోకలకు అనువుగా జీవీఎంసీ అధికారులు తీర్చిదిద్దాలని చిట్టివలస ప్రజలు కోరుతున్నారు.

'స్థానికుడు కాదనడం సరికాదు'



మాట్లాడుతున్న పెద ఎర్రినాయుడు

పద్మనాభం: ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు స్థానికుడు కాదనడం సరికాదని వెలమ కులస్తులు, వైఎస్సార్ సీపీ నాయకుడు గొర్రిపాటి పెద ఎర్రినాయుడు, కశిరెడ్డి ప్రభాకర్ అన్నారు. అనంతవరంలో బుధవారం విలేకరులతో వారు మాట్లాడారు. ముత్తంశెట్టి శ్రీనివాసరావు రెండు సార్లు భీమునిపట్నం ఎమ్మెల్యేగా గెలిచారని తెలిపారు. వైఎస్సార్ సీపీ తరఫున వచ్చే ఎన్నికల్లో భీమునిపట్నం ఎమ్మెల్యే సీటు ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు ఇవ్వకూడదని, స్థానికులకు ఇవ్వాలని వెలమ సంఘం తరఫున కొందరు కోరినట్లు ఇటీవల పత్రికల్లో వార్తలు వచ్చాయన్నారు. అలా కోరడం మంచి పద్ధతి కాదన్నారు. స్థానికతను తమ పార్టీ అధిష్ఠానం నిర్ణయిస్తుందని తెలిపారు. పద్మనాభం మండలంలో వెలమ సంఘం లేదని పేర్కొన్నారు. ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావును విమర్శిస్తే సహించేది లేదన్నారు. సమావేశంలో అనంతవరం ఉప సర్పంచ్ కిలపర్తి సత్యనారాయణ, గొర్లె బంగారునాయుడు, కరిమిరెడ్డి రవికుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం ఆక్రమణకు యత్నం



ఆక్రమించడానికి చదును చేసిన స్థలం

భీమునిపట్నం: భీమిలి సమీపంలోని కృష్ణా కాలనీ వద్ద విలువైన ప్రభుత్వ స్థలం ఆక్రమణకు కొందరు ప్రయత్నించారు. ఇక్కడి కొండపైన ఉన్న కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి ఆలయానికి వెళ్లే మార్గంలోని కొండ వాలు ప్రాంతంలో మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పొక్లెయిన్ సాయంతో సుమారు రూ.50 లక్షలకు పైగా విలువ చేసే స్థలాన్ని చదును చేయించి ఆక్రమించుకోవడానికి ప్రయత్నించారు. విషయం తెలుసుకున్న సచివాలయ వీఆర్వో సంఘటన స్థలానికి వెళ్లి పనులు ఆపించారు. బుధవారం అధికారులు ఈ స్థలాన్ని పరిశీలించారు. దీనిపై తహసీల్దార్ కె.వేణుగోపాల్ మాట్లాడుతూ ఇక్కడి ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకోవడానికి ప్రయత్నించిన వారిపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు.

ప్రజా సంక్షేమానికి రూ.2 లక్షల కోట్లు



వాంబేకాలనీలో వృద్ధురాలికి కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

- వలంటీర్లకు పవన్ క్షమాపణ చెప్పాలి
- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

మధురవాడ: ప్రజా సంక్షేమ కార్యక్రమాల కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం రూ. 2 లక్షల కోట్లు ఖర్చు చేసిందని, ఆ సంక్షేమ పథకాలు కూడా ప్రజల ఇంటి వద్దకే అందిస్తున్న ఘనత ఆయనదేనని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు చెప్పారు. బుధవారం సాయంత్రం జీవీఎంసీ 7వ వార్డు వాంబేకాలనీలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కాలనీలోని నివాసాల వద్దకు వెళ్లి స్థానికుల సమస్యలు తెలుసుకుని, ప్రభుత్వం ద్వారా జరిగిన మేలును వివరించారు.

లబ్ధిదారులకు సంక్షేమ పథకాల కరపత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కుల, మత, రాజకీయాలు, ప్రాంతం వంటి వివక్ష లేకుండా అవినీతి, లంచాలు లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోనే సంక్షేమ పథకాల నగదు జమ చేస్తున్నామని చెప్పారు. పలు పథకాలు అమలు చేస్తూ, అభివృద్ధి పనులు చేపడుతున్నా సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి ఇంకా పూర్తి స్థాయిలో సంతృప్తి చెందక ప్రజల బాగోగులు తెలుకోవాలని తమను ఇంటింటికీ పంపిస్తున్నారని చెప్పారు. ఈ సందర్భంగా వాంబేకాలనీ యూపీహెచ్‌సీలో మందుల కొరత వంటి సమస్యలను స్థానికులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు.

పవన్ బేషరతుగా క్షమాపణ చెప్పాలి

అనునిత్యం ప్రజా సంక్షేమం కోసం గౌరవ వేతనంతో పనిచేస్తున్న వలంటీర్లపై పవన్ కల్యాణ్ అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని, వెంటనే బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వలంటీర్ల సేవలను ఆయన అభినందించారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో ప్రాణాలకు తెగించి ఇంటింటికీ వెళ్లి ఫీవర్ సర్వే చేసిన తీరును కూడా మరచిపోయావా పవన్ అంటూ ప్రశ్నించారు. రెండున్నర లక్షల మంది వలంటీర్ల మనోభావాలను పవన్ దెబ్బ తీశాడని, నిరాశ నిస్పృహతోనే ఇలాంటి మాటలు వస్తున్నాయని విమర్శించారు. బుద్ధి మారకపోతే సినిమాలు కూడా ఫ్లాప్ అయిపోతాయని హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు, వార్డు సచివాలయాల ఇన్‌చార్జి కుడితి రామారావు, రామిరెడ్డి, ఎల్లాజీ, చేకూరి రజని, తమ్మినేని వరలక్ష్మి, మంగ, పిళ్లా సూరిబాబు, పెంద్ర అప్పన్న, వరలక్ష్మి, జగ్గుపిల్లి నరేష్, డాక్టర్.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మిల్లెట్ మేళా బ్రోచర్ ఆవిష్కరణ

ఉక్కునగరం: ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) ఆధ్వర్యంలో నిర్వహించనున్న 'ఈట్ రైట్ ఇండియా – వాక్‌థాన్ అండ్ మేళా' బ్రోచర్‌ను బుధవారం ఆవిష్కరించారు. స్టీల్‌ప్లాంట్ సహకారంతో ఈ నెల 29న ఉక్కునగరంలో ఉదయం వాక్‌థాన్ నిర్వహించనున్నారు. అదే రోజు ఉక్కునగరం క్లబ్‌లో మిల్లెట్స్‌పై వంట పోటీలు ఏర్పాటు చేశారు. బాలబాలికలకు వ్యాసరచన, స్లోగన్, పోస్టర్ పెయింటింగ్ తదితర పోటీలు నిర్వహిస్తున్నారు. ఉక్కు ప్రధాన పరిపాలన భవనంలో జరిగిన కార్యక్రమంలో సీఎండీ అతుల్ భట్, డైరెక్టర్లు డి.కె. మొహంతి, అతుల్ భాగ్వే, ఎస్.సి. పాండే పాల్గొన్నారు.